


తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :85 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ గురువారం 01 జనవరి 2025

# భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం ‘ప్రళయ్‘

- -వరుసగా రెండు మిస్సైల్స్ పరీక్ష విజయవంతం
- -150 నుంచి 500 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే సత్తా
- -డీఆర్డీవో శాస్త్రవేత్తలను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్
- -త్వరలోనే సైన్యంలో చేరనున్న ప్రళయ్ క్షిపణులు



భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. బుధవారం ఒడిశా తీరంలో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి ‘ప్రళయ్‘ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒకే లాంచర్ నుంచి రెండు క్షిపణులను స్వల్ప వ్యవధిలో ప్రయోగించి వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా పరిశీలించారు. యూజర్ ఎవాల్యుయేషన్ ట్రయల్స్‌లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించాయని అధికారులు తెలిపారు. చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మోహరించిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును ధృవీకరించుకున్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ‘ప్రళయ్‘ క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు.

# 2026లో రెట్టింపు సంతోషం, అభివృద్ధి అందిస్తాం

-ప్రజల సహకారంతోనే ఈ ప్రగతి సాధ్యమైందని కృతజ్ఞతలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన 2025 సంవత్సరం కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని, రాబోయే ఏడాదిలో ప్రజలకు రెట్టింపు సంతోషం, సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. 2025 సంవత్సరం పనితీరును సమీక్షిస్తూ చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు.

# జమ్మూకశ్మీర్‌లో ప్రాజెక్టుల వేగవంతం..

## చీనాబ్ నదిపై మరో ప్రాజెక్టుకు భారత్ గ్రీన్ సిగ్నల్

- చీనాబ్ నదిపై దుల్హస్తీ-II ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు
- సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన తర్వాత కీలక పరిణామం
- రూ.3,277 కోట్ల అంచనా వ్యయంతో 260 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- భారత్ నిర్ణయంపై ఐక్యరాజ్యసమితిని ఆశ్రయించిన పాకిస్థాన్
- పశ్చిమ నదులపై పలు ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తున్న కేంద్రం



సింధు జలాల ఒప్పందాన్ని ఏకపక్షంగా నిలిపివేసిన భారత్, పాకిస్థాన్‌తో జలవివాదంలో మరో కీలక ముందడుగు వేసింది. జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో చీనాబ్ నదిపై నిర్మించ తలపెట్టిన 260 మెగావాట్ల దుల్హస్తీ స్టేజ్-II జలవిద్యుత్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ( ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. దీని అంచనా వ్యయం సుమారు రూ. 3,277 కోట్లు. ఇప్పటికే పనిచేస్తున్న 390 మెగావాట్ల దుల్హస్తీ స్టేజ్-× ప్లాంట్‌కు అనుబంధంగా దీన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 60.3 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో 8.27 హెక్టార్ల ప్రైవేట్ భూమిని సేకరించాల్సి ఉంటుంది.

# వీబీ జీ రామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

## ఉమ్మడి ఏపీలో వైఎస్ హయాంలోనే ఉపాధి చట్టానికి బీజం పడిందన్న షర్మిల



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషితో, కాంగ్రెస్ హయాంలో ఈ చట్టానికి బీజం పడిందని, దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ పథకాన్ని ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. గత 20 ఏళ్లలో ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్లు నిధులు వచ్చాయని, పేదలకు అండగా నిలిచిన ఈ పథకానికి మోదీ ప్రభుత్వం ‘వీబీ జీ రామ్ జీ‘ పేరుతో తీసుకొచ్చిన కొత్త చట్టం తూట్లు పొడుస్తోందని షర్మిల విమర్శించారు. కాంగ్రెస్ తెచ్చిన చట్టానికి, బీజేపీ తెచ్చిన కొత్త చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఎద్దేవా చేశారు.

# తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తుంది

- అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి
- ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్ష



# చైనాకు షాకిచ్చిన భారత్.. స్టీల్ దిగుమతులపై పన్ను

- -చైనా నుంచి దిగుమతయ్యే చౌక ఉత్పత్తులే టార్గెట్
- -కొన్ని రకాల స్టీల్ ఉత్పత్తులపై 12 శాతం టారిఫ్ విధించిన కేంద్రం



స్టీలు ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. స్టీలు దిగుమతులపై పన్ను విధిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. చైనా నుంచి దిగుమతి అవుతున్న చౌక స్టీలు ఉత్పత్తులే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి.. ముఖ్యంగా చైనా నుంచి దిగుమతి అవుతున్న పలు చౌక స్టీలు ఉత్పత్తులపై 12 శాతం పన్ను విధించింది. స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులకు కూడా ఇది వర్తిస్తుంది. దేశీయంగా ఉక్కు తయారీదారుల ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్న ఈ నిర్ణయంతో చైనాకు షాక్ తగలనుంది.

# ప్రభుత్వ పాలనకు అధికారులే వెన్నెముక

- పేదవాడి జీవితం మారేది అధికారుల చిత్తశుద్ధి వల్లేనని వ్యాఖ్య
- 2026లో మరింత వేగంగా పనిచేసి వికసిత్ ఆంధ్రాను నిర్మిద్దామని పిలుపు



2026 నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ సహా అన్ని విభాగాల అధికారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాలనకు అధికారులే వెన్నెముక అని ఆయన అభివర్ణించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి, వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి తమ సొంత ఊళ్లను వదిలి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవ చేస్తున్న అధికారుల త్యాగాలను తాము లోతుగా గుర్తిస్తున్నామని, వారి సేవలకు కృతజ్ఞతలు అని పవన్ పేర్కొన్నారు.

# కొత్త సంవత్సరం ప్రజల ఆశలు, ఆకాంక్షల్ని నిజం చేయాలి: ప్రత్తిపాటి

**- చంద్రబాబు నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం 2026లో సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే తలమానికంగా నిలవాలి**

చిలకలూరిపేట అక్షర విజేత



–" 2025 అభివృద్ధి సంక్షేమ కూటమినామ సంవత్సరంగా ప్రజలకు, రాష్ట్రానికి ఎనలేని ప్రయోజనాలు అందించింది. అలానే 2026లో కూడా చంద్రబాబు నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రజాసంక్షేమం, రాష్ట్రప్రగతిలో దేశానికే తలమానికంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను. పోలవరం, అమరావతి తుదిదశ నిర్మాణంతో పాటు, ప్రపంచం మెచ్చే ప్రగతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదగాలని ఆశిస్తున్నాను. ఈ కొత్త సంవత్సరంలో రైతుల లోగిళ్లలో సుఖసంతోషాలు వెల్లి విరియాలని, ప్రజలందరి జీవితాల్లో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం నిండాలని కోరుకుంటున్నాను. ఆర్థిక ఇబ్బందుల్ని అధిగమిస్తూ, గత పాలకుల విధ్వంసం, వ్యవస్థల విచ్ఛిన్నాన్ని సరిదిద్ది, రాష్ట్రాన్ని ప్రగతిమార్గంలో వికాసం వైపు పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా సంస్కరణలు నవ్యాంధ్రప్రదేశ్ దశదిశను సంపూర్ణంగా మారుస్తాయనే నమ్మకం ప్రజల్లో బలపడటం శుభపరిణామం. 2026 కూడా కూటమి శ్రేణులు, ఆంధ్రుల ఆశల్ని, ఆకాంక్షల్ని నిజం చేస్తుందని మనస్ఫూర్తిగా నమ్ముతూ.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు, నాయకులకు, నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు హృదయపూర్వక నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. " అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నటిడిపి ఇన్చార్జ్ ఎన్. రాఘవేందర్ రెడ్డి. జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి లక్ష్మన్న .బిజెపి ఇంచార్జ్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి



అక్షర విజేత మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామంలో పెన్షన్లు పంచే కార్యక్రమం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న, బిజెపి పార్టీ ఇంచార్జ్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి చేతుల మీదుగా పెన్షన్లు పంచే కార్యక్రమం చేపట్టారు. మాలపల్లి గ్రామంలోఇంటింటికి తిరిగి పెన్షన్లు పంచారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్చార్జ్ రాఘవేందర్ రెడ్డి. మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ గా అమలు చేస్తున్నామని వాటితో పాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు కూడా చేస్తున్నామని, వాటితోపాటు మంత్రాలయం నియోజకవర్గం లో ఎన్ని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు వెళు తుందని ఎన్ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, కె పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి దశలో నడిపిస్తూ ఎన్నో సంక్షేమ పథకా లు అమలు చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధుల సమస్య లేకుండా నిధులు విడుదల చేస్తున్నారని వాల్మీకి బి లక్ష్మన్న తెలిపారు. బిజెపి ఇన్చార్జ్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు అభివృద్ధి కార్యక్రమాలకు నరేంద్ర మోడీ ప్రధానమంత్రి. రాష్ట్రానికి నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో , సెక్రెటరీ , మాలపల్లి టిడిపి నాయకులు మాజీసర్పంచ్ టిడిపి అధికార ప్రతినిధి చావడి వెంకటేష్, జెడ్పిటిసి లక్ష్మయ్య, వీరేషు,చంద్ర, టిడిపి మహిళా నాయకురాలు లక్ష్మి, సచివాలయం సిబ్బంది మరియు టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో గంగాధర్..





వెలిగండ్ల మండల పరిధిలోని మొగల్లూరు గ్రామపంచాయతీలో బుధవారం ఒక్కరోజు ముందే పెన్షన్లు పంపిణీ చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి ఆర్ గంగాధర్ ఆధ్వర్యంలో మొగల్లూరు బస్టాండ్ సెంటర్ నందు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బైసాని సుబ్రహ్మణ్యం మాజీ పార్టీ అధ్యక్షుడు పల్నాటి బాలకోటిరెడ్డి, బూత్ కన్వీనర్ సోమిశెట్టి వెంకట సుబ్బారావు, ఎస్.కె మౌలానా ఆజాద్, మహిళా నాయకురాలు షేక్ షానావాజ్ బేగం, సిద్దు హుస్సేన్ కృపయ్య, సచివాలయం సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# వీబీ జీ రామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

కొత్త చట్టం ప్రకారం ఉపాధిని హక్కుగా కాకుండా, కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మార్చారని ఆమె మండిపడ్డారు. గ్రామసభలకు ఉండాల్సిన నిర్ణయాధికారాన్ని ఢిల్లీ చేతుల్లో పెట్టారని, 100 రోజుల పని దినాలను కుదించి, నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏడాదికి 60 రోజులు పని లేకుండా చేయడం, ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే పనులు కల్పించడం వంటి నిబంధనలు పేదలకు అన్యాయం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్రం ఈ కొత్త విధానాన్ని తెచ్చిందని విమర్శించారు. ఈ 'నల్లచట్టాన్ని' వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఏపీసీసీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, ఇతర పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# చైనాకు షాకిచ్చిన భారత్..

అక్కడి నుంచి మన దేశానికి దిగుమతయ్యే వస్తువులు తగ్గనున్నాయి. చైనా, వియత్నాం, నేపాల్ దేశాలకు ఈ సుంకాలు వర్తించనుండగా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు కేంద్రం మినహాయింపు ప్రకటించింది.కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. స్టీలు ఉత్పత్తులపై దిగుమతి సుంకం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. తొలి ఏడాది 12 శాతం పన్ను, రెండో ఏడాది 11.5 శాతం, మూడో ఏడాది 11 శాతం పన్ను వసూలు చేయనున్నట్లు పేర్కొంది.డీజీటీఆర్ సిఫార్సుతోనే నిర్ణయం..స్టీల్ దిగుమతులు గణనీయంగా పెరగడంతో దేశీయ పరిశ్రమలకు తీవ్ర నష్టం కలుగుతోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ (డీజీటీఆర్) తెలిపింది. దీంతో దిగుమతి సుంకం విధించాలంటూ కేంద్రానికి సిఫార్సు చేయగా.. ఆర్థిక శాఖ తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది

## పల్లవెంకన్న నర్సరీలో నూతన సంవత్సర సంబరాలు




. కడియం పల్లవెంకన్న నర్సరీలో 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అద్భుతమైన వన కూర్పును సృష్టించారు. వివిధ రంగులు, జాతుల మొక్కల సమ్మేళనంతో రూపొందించిన ఈ ఆకృతి అందరినీ ఆకట్టుకుంటోంది. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త ఏడాదిని సృజనాత్మకంగా ఆహ్వానించేలా మొక్కలతో "హ్యాపీ న్యూ ఇయర్ 2026" అనే అక్షరాలను ఆకర్షణీయంగా రూపొందించారు. వివిధ రకాల మొక్కల సోయగాలతో సుందరీకరించిన ఈ కూర్పు ప్రకృతి ప్రేమికులను, సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. పల్లవెంకన్న నర్సరీ రైతు పల్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) కుమారులు, యువ రైతులు పల్ల వెంకటేష్, వినయ్ ఈ ఆకృతులను రూపకల్పన చేశారు. దాదాపు నాలుగు రోజులపాటు సుమారు 50 మంది కార్మికులు శ్రమించి వేల మొక్కలతో ఈ వన కూర్పును సిద్ధం చేసినట్లు నర్సరీ రైతులు తెలిపారు. సందర్శకుల సౌకర్యార్థం ఈ మొక్కల కూర్పును జనవరి 18 వరకూ నర్సరీలో ఉంచనున్నట్లు వారు వెల్లడించారు.

# భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం 'ప్రళయ్'

ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సాలిడ్ ప్రొపెల్లెంట్ క్వాసీ-బాలిస్టిక్ మిసైల్. అత్యాధునిక నావిగేషన్, గైడెన్స్ వ్యవస్థలతో పనిచేసే ఈ క్షిపణి.. వివిధ రకాల వార్‌హెడ్‌లను మోసుకెళ్తూ శత్రువుల స్థావరాలపై విరుచుకుపడగలదు. హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ తో పాటు పలు డీఆర్డీవో ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి సంస్థల సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు.ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సాల్వో లాంచ్ విజయవంతం కావడంతో క్షిపణి విశ్వసనీయత నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంపై డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ క్షిపణి వ్యవస్థను సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

# 2026లో రెట్టింపు సంతోషం, అభివృద్ధి అందిస్తాం

"2025 కేవలం ఒక గడిచిన సంవత్సరం కాదు, నాటి విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్‌ను వికాసం వైపు నడిపించిన గొప్ప మలుపు" అని ఆయన అభివర్ణించారు. ఎన్నో సవాళ్లను అధిగమించి డబుల్ డిజిట్ వృద్ధి సాధించామని, పెట్టుబడిదారుల్లో విశ్వాసం పునరుద్ధరించామని తెలిపారు. గూగుల్ వంటి భారీ సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, క్వాంటం టెక్నాలజీకి పునాదులు వేశామని పేర్కొన్నారు. అదేవిధంగా 'మొంథా' తుఫాను వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు సకాలంలో సహాయం అందించినట్లు గుర్తుచేశారు.ఈ విజయాల వెనుక నిబద్ధతతో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారని ప్రశంసించారు. అయితే, వీటన్నింటికన్నా ప్రజలు తమపై ఉంచిన నమ్మకం, సహకారమే ఈ ప్రగతికి అసలైన చోదక శక్తి అని చంద్రబాబు అన్నారు. 2026లో పాలనలో వేగాన్ని పెంచి "హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ" లక్ష్యాన్ని చేరుకోవడంలో మరిన్ని అడుగులు వేస్తామని స్పష్టం చేశారు. ఈ స్ఫూర్తితో నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త కాంతులు నింపాలని మనసారా కోరుకుంటూ, ప్రజలందరికీ హ్యాపీ న్యూ ఇయర్ చెప్పారు

# జమ్మూకశ్మీర్‌లో ప్రాజెక్టుల వేగవంతం.

తాజా అనుమతులతో నిర్మాణ టెండర్లను పిలిచేందుకు చీనూజకి మార్గం సుగమమైంది.2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత, 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పశ్చిమ నదులపై తనకున్న హక్కులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. "సింధు జలాల ఒప్పందం 2025 ఏప్రిల్ 23 నుంచి నిలిపివేయబడింది" అని జూూజ తన సమావేశపు మినిట్స్‌లో స్పష్టంగా పేర్కొనడం ఈ ప్రాజెక్టు వేగవంతం వెనుక ఉన్న వ్యూహాన్ని తెలియజేస్తోంది.కేవలం దుల్హస్తీ-×× మాత్రమే కాకుండా, చీనాబ్ నదిపై 1,856 మెగావాట్ల సావల్‌కోట్ ప్రాజెక్టుతో పాటు రాటిల్, బుర్సార్, పాకల్ దుల్ వంటి అనేక ఇతర ప్రాజెక్టుల పనులను కూడా భారత్ వేగవంతం చేస్తోంది. ఈ పరిణామాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. భారత్ చర్యలు ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ, జోక్యం చేసుకోవాలని కోరుతూ ఐక్యరాజ్యసమితికి లేఖ రాసింది. అయితే, భారత్ ఒప్పందాన్ని పక్కనపెట్టినప్పటికీ, ఈ వివాదాన్ని విచారించే అధికారం తమకుందని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు (గ్రజూూ) గతంలోనే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రాజెక్టులతో ముందుకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ప్రభుత్వ పాలనకు అధికారులే వెన్నెముక

అసెంబ్లీలో తాము విధానాలను, చట్టాలను రూపొందిస్తే.. వాటికి క్షేత్రస్థాయిలో ప్రాణం పోసేది అధికారులేనని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులుగా తాము దిశానిర్దేశం మాత్రమే చేస్తామని, కానీ సామాన్యుడి జీవితం నిజంగా మారాలంటే అది అధికారుల చిత్తశుద్ధి, పరిపాలన దక్షతపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీ పునర్నిర్మాణం అనేది ఒక సమిష్టి స్వప్నమని, దీనిని సాకారం చేయడంలో అధికారుల భుజస్కంధాలపైనే పెద్ద బాధ్యత ఉందని గుర్తుచేశారు.2026లో అధికార యంత్రాంగం మరింత వేగంగా, మానవీయ కోణంతో పనిచేయాలని పవన్ ఆకాంక్షించారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం నూతనోత్సాహంతో పనిచేద్దామని, వికసిత్ భారత్ నిర్మాణంలో ఏపీని ఆదర్శంగా నిలపాలని ఆయన అధికారులకు పిలుపునిచ్చారు.

# తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తుంది

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు పేర్కొన్నారు.అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కొత్త ఏడాది ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2026 సంవత్సరంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో తెలంగాణ వేగవంతమైన పురోగతిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.2026 నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. నగరంలో వివిధ ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు వినోద కార్యక్రమాలు నిర్వహించి 2026 సంవత్సరం రాగానే పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# నూతన సంవత్సరానికి ముస్తాబైన శ్రీ సత్య దేవా నర్సరీ.

కడియం అమరావతి జ్యోతి ప్రతినిధి వై. నరేష్ కడియం మండలం, కడియపులంక శ్రీ సత్య దేవా నర్సరీ నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబయింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సుమారుగా నలభై ఐదు వేల మొక్కలతో అందమైన కూర్పును ఏర్పాటు చేశారు. నూతన సంవత్సరం, సంక్రాంతి, రిపబ్లిక్ డే, ఉగాది, స్వాతంత్ర్య దినోత్సవం, దసరా వంటి అనేక సందర్భాలలో ఈ నర్సరీలో వనకూర్పును ఏర్పాటు చేస్తారు. అటువంటి నర్సరీలో 2026 కొత్త సంవత్సర శుభాకాంక్షలు సృజనాత్మకంగా అందించారు. అల్ట్రానేంట్రా (వైట్, రెడ్, గ్రీన్, ఎల్లో) ఆర్బిఫోలియా (బ్లాక్) మనోడాక్రస్, డ్రెస్సీనా (మిల్క్, గోల్డ్), ఫైకస్, సాల్రియా మరియు చామంతి తదితర రకాల మొక్కలతో హ్యాపీ న్యూ ఇయర్ 2026 అంటూ అక్షరాలను అలంకరించారు. శ్రీ సత్య దేవా నర్సరీ అధినేత ఆంజనేయులు వారి కుమారులు వీరబాబు మరియు రాజశేఖర్ల ఆధ్వర్యంలో సుమారు వారం రోజులపాటు ఈ ఆకృతుల తీర్చి దిద్దినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా నర్సరీ అధినేత ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఆకృతులు మధ్య ఫొటోలు తీయించుకోవడానికి పలు రాష్ట్రాల నుంచి నాయకులు, స్వామీజీలు, సందర్శకులు ఫోటోలు తీయించుకోవడానికి ఉత్సాహం చూపుతారన్నారు




.సందర్శకుల సౌకర్యార్థం ఈ మొక్కల కూర్పును జనవరి చివరి వరకు నర్సరీలో ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు.

# చంద్రబాబు సంక్షేమం దేశానికే రోల్ మోడల్, పరిపాలన గొప్ప కేస్ స్టడీ :

**-ముఖ్యమంత్రి పాలనా విధానాలు, సంస్కరణలు, సవాళ్లను అధిగమించే తీరు.. ఆర్థిక, రాజకీయ, సామాజిక నిపుణులకే కేస్ స్టడీ.**

**76 ఏళ్ల వయసులో రాష్ట్రం కోసం చంద్రబాబు పడుతున్న కష్టం ఇతర ముఖ్యమంత్రుల్ని ఆశ్చర్య పరుస్తోంది.**

**వైసీపీనేతలు, సానుభూతిపరులు తప్ప కూటమిపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు.**

**-ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన మాజీమంత్రి ప్రత్తిపాటి.**

**చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాలతో పాటు, పట్టణంలో ఉదయాన్నే పేదల ఇళ్లకు వెళ్లి, వారి సమస్యలు తెలుసుకున్న ప్రత్తిపాటి.**





దార్శనిక నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమం దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తోందని, పథకాల అమల్లో కూటమిప్రభుత్వం జాతీయస్థాయిలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అనుభవంతో కూడిన చంద్రబాబు పనితీరు.. వినూత్నఆలోచనలతో నిండిన పాలనా సంస్కరణలు రాజకీయ, ఆర్థిక, సామాజిక వేత్తలకే కేస్ స్టడీగా నిలుస్తున్నాయని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని పలు గ్రామాలు, వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లు అందచేశారు. తొలుత నాదెండ్ల మండలం గణపవరం, చిరుమామిళ్ల గ్రామాల్లో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలుతో కలిసి పింఛన్లు అందించిన ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. అనంతరం చిలకలూరిపేట మండలం పోతవరం, యడ్లపాడు మండలం జాలాది గ్రామాల్లో, పట్టణంలోని 17వ వార్డులో స్వయంగా ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు చెప్పిమరీ ప్రత్తిపాటి పింఛన్ల సొమ్ము అందించారు. చంద్రబాబు పాలనపై ప్రజల్లో పూర్తిస్థాయి సంతృప్తి..కూటమి పాలనలో ప్రజలందరూ చాలా సంతోషంగా ఉన్నారని.. వైసీపీ నాయకులు.. ఆపార్టీ సానుభూతిపరుల్లో తప్ప, మిగిలిన వారిలో చంద్రబాబు పాలనపై పూర్తిస్థాయి సంతృప్తి కనిపిస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లు రాష్ట్ర ప్రయోజనాలకోసం రాజీలేని విధంగా చేస్తున్న కృషిని ప్రజలు గమనిస్తున్నారన్న ప్రత్తిపాటి.. చంద్రబాబు నాయకత్వంలో కూటమిప్రభుత్వమే సుదీర్ఘకాలం అధికారంలో ఉండాలని బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. జగన్ ఆర్థిక విధ్వంసం, పాలన వ్యవస్థల నిర్వీర్యం నుంచి కేవలం ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని గట్టెక్కించడం సామాన్య విషయం కాదన్న ప్రత్తిపాటి.. చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన నాయకుడి వల్లే ఇది సాధ్యమైందన్నారు. 76 ఏళ్ల వయసులో ఏమాత్రం విశ్రాంతి లేకుండా చంద్రబాబు తక్కువ సమయంలో ఇవన్నీ ఎలా చేస్తున్నాడనే ఆలోచన, ఆశ్చర్యం ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులందరిలో ఉందని ప్రత్తిపాటి తెలిపారు. 18 నెలల్లో 24 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టడం.. లోకేశ్ సమర్థతకు నిదర్శనంకేవలం 18 నెలల్లో రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడంతో పాటు..వాటి గ్రౌండింగ్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం లోకేశ్ వంటి యువనాయకుడి సమర్థతకు నిదర్శనమని ప్రత్తిపాటి కొనియాడారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీకి కట్టుబడిన మంత్రి లోకేశ్.. అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారన్నారు. పొలంపై వచ్చే ఆదాయం కంటే.. పింఛన్ల లబ్దే ఎక్కువఒక్కో కుటుంబానికి వారికుండే పొలంపై వచ్చే కౌలుసొమ్ము కంటే అధికంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రభుత్వం నుంచి క్రమంతప్పకుండా ప్రతినెలా అందుతున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. లోక్ సభ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లాలతో కలిసి పేదల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించడం ఎంతో సంతృప్తిని ఇచ్చినట్టు ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోనే అతిపెద్ద దాత రామిరెడ్డి: ప్రత్తిపాటి

**- చిరుమామిళ్ల గ్రామాభివృద్ధిలో, ప్రజలకు మంచి చేయడంలో రామిరెడ్డి దాతృత్వం మార్గదర్శనీయం**

**: - రాష్ట్ర విద్యార్థులు యువకులయ్యే నాటికి వారికోసం ఉద్యోగాలు ఎదురుచూడాలన్నదే లోకేశ్ ఆలోచన.**

**ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించి, క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన మాజీమంత్రి.**

చిరుమామిళ్ల అక్షర విజేత

తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదల సంక్షేమానికి, ముఖ్యంగా మెరుగైన విద్యాబోధనకు వెచ్చించే వారు అరుదుగా ఉంటారని, అలాంటి వారిలో నడికట్టు రామిరెడ్డి ఒకరని, నియోజకవర్గంలోనే అతిపెద్ద దాతగా ఆయన నిలిచారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.బుధవారం ఆయన నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించి, 2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులు, గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు.అభివృద్ధిపనులు చేయడం రామిరెడ్డి వ్యసనంనడికట్టు రామిరెడ్డి చిరుమామిళ్ల గ్రామంలో జన్మించడం.. గ్రామస్తులకు వరమన్న ప్రత్తిపాటి, గ్రామాభివృ ద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించిన ఆయన దాతృత్వం ఎందరో దాతలకు ప్రేరణగా, మార్గదర్శిగా నిలుస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు పిలుపునిచ్చిన పీ–4కు నిజమైన మార్గదర్శిగా నిలిచిన రామిరెడ్డి.. నియోకవర్గంలోనే అతిపెద్ద దాతగా నిలిచారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధితో పాటు, రూ.5 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు, దేవాలయాల అభివృద్ధికి రూ.40 లక్షలు, ఇంటింటికీ మంచినీరు అందించేందుకు రూ.40 లక్షలు, చర్చిల నిర్మాణానికి రూ.20 లక్షలు, సొంత నిధులతో కల్యాణ మండపం నిర్మాణం, ఎస్టీ కాలనీ వాసులకు ఇళ్ల నిర్మాణం, గ్రామంలో రోడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలతో రామిరెడ్డి చేపట్టడం నిజంగా అభినందనీయమని ప్రత్తిపాటి కొనియాడారు. ప్రభుత్వాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు ఉపయోగపడే అతికొద్ది మంది వ్యక్తుల్లో రామిరెడ్డి ఒకరని, గ్రామాభివృద్ధి ఆయనకు వ్యసనంలా మారిందని ప్రత్తిపాటి తెలిపారు. యువతకోసం ఉద్యోగాలు ఎదురుచూడాలన్నదే లోకేశ్ సంకల్పం..రాష్ట్రంలోని విద్యార్థులు, విద్యాభ్యాసం ముగించుకొనే నాటికి వారికోసం ఏపీలో ఉద్యోగాలు ఎదురు చూడాలన్న సత్సంకల్పంతోనే యువనేత లోకేశ్ ఏరికోరి మరీ విద్యాశాఖ బాధ్యతలు తీసుకున్నారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల నాయకత్వం ప్రజలకు, రాష్ట్రానికి ఏ లోటూ లేకుండా చేస్తుందని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశానిక ఆదర్శంగా నిలుపుతుందని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.పార్టీలు, వర్గాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి తీవ్రకృషి చేస్తున్న రామిరెడ్డి వంటివారిని చూశాకైనా చిరుమామిళ్ల గ్రామస్తుల ఆలోచన మారాలన్న ప్రత్తిపాటి.. తన గెలుపుకోసం వయసుని సైతం లెక్కచేయకుండా రామిరెడ్డి పనిచేశారన్నారు. అలాంటి వ్యక్తి మాటకు విలువిచ్చి గౌరవించడమే ఆయనకు మీరు ఇచ్చే మర్యాదని ప్రత్తిపాటి గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# క్రమశిక్షణతో కూడిన వేడుకలే పవన్ కళ్యాణ్ గారికి ఇచ్చే గౌరవం

**- జనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ**



చిలకలూరిపేట అక్షర విజేత నియోజకవర్గ యువతకు, జనసైనికులకు జనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి జనసైనికుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ, క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా నూతన సంవత్సర వేడుకల సమయంలో యువత రోడ్ల మీదకు వచ్చి కేక్ కటింగ్లు, మితిమీరిన వేగంతో బైక్ రైడింగ్‌లు వంటి పనులకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. ఉత్సాహం ముసుగులో అపశృతులకు తావివ్వకుండా, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లోనే ఆనందంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. జనసైనికుల క్రమశిక్షణే పార్టీకి బలమని, బాధ్యతాయుతమైన పౌరులుగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామని చరణ్ తేజ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఎడ్లపాడు మండలంలో పటిష్ట బందోబస్తుతో నూతన సంవత్సరం వేడుకలకు పోలీసులు సిద్ధం..

**-మండల ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సై టి శివరామకృష్ణ.**



ఎడ్లపాడు అక్షర విజేత ఎడ్లపాడు మండల ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఈ రాత్రి అర్ధరాత్రి జరిగే నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు శాంతియుతంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని ఎడ్లపాడుపోలీసులు విజ్ఞప్తిచేశారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ ఎడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.ముఖ్య కూడళ్లలో, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో, దేవాలయాలు, హోటళ్లు, ప్రధాన రహదారుల వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయగా, నైట్ ప్యాట్రోలింగ్‌ను మరింత కఠినతరం చేసినట్లు ఆయన చెప్పారు.ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలను పోలీసులు విడుదల చేశారు.మద్యం సేవించి వాహనాలు నడిపితేచట్టపరమైన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలన్నారు. అలాగే అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, స్టంట్లు చేయడం పూర్తిగా నిషేధించబడిందని స్పష్టంచేశారు.మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని, ఎవరైనా అసభ్య ప్రవర్తనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులుహెచ్చరించారు. ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శబ్ద కాలుష్యం, గొడవలు, రోడ్లపై గుమిగూడటం, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించడం వంటి చర్యలుఅనుమతించబడవని తెలిపారు.యువత తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కూడా విజ్ఞప్తిచేశారు.ఏవైనా అనుమానాస్పద లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే ఎడ్లపాడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. "ప్రజల సహకారమే శాంతియుత నూతన సంవత్సరం వేడుకలకు కీలకం" అని ఎస్‌ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

# నూతన సంవత్సర వేడుకలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**-ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు : అర్బన్ సీఐ రమేష్**

చిలకలూరిపేట అక్షర విజేత చిలకలూరిపేట పట్టణ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను అత్యంత క్రమశిక్షణతో, చట్టానికి లోబడి జరుపుకోవాలని అర్బన్ సీఐ రమేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణ ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేస్తూనే, భద్రతా పరమైన అంశాలపై హెచ్చరికలు జారీ చేశారు.నిరంతర నిఘా మరియు పోలీసింగ్‌డిసెంబర్ 31 అర్ధరాత్రి వేడుకల సమయంలో పట్టణంలోని ప్రతి ప్రధాన కూడలి, వీధి మరియు కీలక ప్రాంతాల్లో పోలీస్ నిఘా ఉంటుందని సీఐ రమేష్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు ఆయన పేర్కొన్నారు.యువతకు ప్రత్యేక సూచనలుముఖ్యంగా యువత ఉత్సాహంలో అతిగా ప్రవర్తించవద్దని ఆయన సూచించారు. నడిరోడ్డు పై కేక్ కటింగ్ లు ,రోడ్లపై బైక్ రేసింగ్‌లు చేయడం.అతి వేగంగా వాహనాలు నడపడం.మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి పనులకు దూరంగా ఉండాలి.బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తించడం లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించేలా అల్లర్లు చేయడం వంటివి చేస్తే సహించేది లేదని ఎవరి ఇంటి ముందు వారు నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని ఆయన స్పష్టం చేశారు.అవాంఛనీయ సంఘటనలపై నిఘావేడుకల పేరుతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన శిక్షలు తప్పవని తేల్చి చెప్పారు.ఆనందం అనేది ఇతరులకు



ఇబ్బంది కలిగించనంత వరకే బాగుంటుందని, కావున పట్టణ ప్రజలందరూ పోలీసులకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలకాలని సీఐ రమేష్ కోరారు.

# సచివాలయాలకు నూతన ప్రింటర్లను అందజేసిన..మున్సిపల్ చైర్మెన్ షేక్ రఫానీ...



చిలకలూరిపేట అక్షర విజేత చిలకలూరిపేట పురపాలక సంఘం పరిధిలోని సచివాలయాలకు ప్రింటర్ లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జి.ఎస్.డబ్ల్యూ.ఎస్.విభాగం అధికారులు మున్సిపల్ కార్యాలయానికి పంపించడం ,జరిగింది. వాటిని బుధవారం నాడుకార్యాలయంలోజి.ఎస్.డబ్ల్యూ.ఎస్.విభాగం అధికారులు సూచించినఆయా సచివాలయాల అడ్మిన్ సెక్రెటరీలకు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని,మున్సిపల్ కమిషనర్ పీ. శ్రీ హరిబాబు.మున్సిపల్ డి ఈ షేక్ అబ్దుల్ రహీం, రెవిన్యూ ఆఫీసర్ పొత్తూరి సుబ్బారావు, మున్సిపల్ మేనేజర్ మొహిద్దిన్ లు కలిసి అందజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు రమేష్,అమిత్, తదితరులు పాల్గొన్నారు

# నూతన సంకల్పాలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న పల్నాడు జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

## -జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఐపీఎస్

పల్నాడు జిల్లా అక్షర విజేత నూతన సంవత్సరం 2026 సందర్భంగా పల్నాడు జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఐపీఎస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు."నూతన సంకల్పాలతో నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న



ఈ శుభ సందర్భంగా, ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, బాధ్యతాయుతంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలి. " ప్రజల స్వేచ్ఛ, భద్రత కాపాడటమే పల్నాడు జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, 2026 సంవత్సరంలో ప్రజల సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తాము" అని తెలిపారు. "పోలీస్ శాఖపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,చట్ట వ్యవస్థల పరిరక్షణలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామనీ", "శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి" చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. 2026 సంవత్సరం పల్నాడు జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, మరోసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు

# విద్యా దేవాలయాలుగా ప్రభుత్వ బడులు

## .-ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్.

రామకుప్పం. అక్షరవిజేత:- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రభుత్వ పాఠశాలను పాఠశాలలను విద్యా దేవాలయాలుగ తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమనిఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ,కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ అఫీషియల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బల్ల పంచాయితీ వల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలువలబడి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విద్యార్థులను మరియు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు సామాజిక బాధ్యతను అలవర్చుతో వారిని బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గత వైకాపా పాలనలో లాగా కాకుండా ఇంటిలో ఎంతమంది పిల్లలు బడికి వెళుతుంటే అందరికీ కూడా తల్లికి వందనం కార్యక్రమం ద్వారా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తుందని పేర్కొంటూ కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ మునస్వామి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పట్రా నారాయణ, మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, ఎంపీపీ సులోచన గుర్రప్ప ,మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ముఖ్య నేతలు రామమూర్తి, నాగభూషణం, మహమ్మద్ రఫీ, విశ్వనాథ్, వెంకటరామ గౌడ, జై ఈ,జయశంకర్, గజేంద్ర ,మునీంద్రానాయక్, బాలకృష్ణ,హనుమంతు, మాజీ ఎంపీటీసీ ఈశ్వరీ, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు పార్టీ నేతలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి ప్రమాణ స్వీకార ఆహ్వాన పత్రికను అందచేసిన నాదెండ్లకమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరివారి మిత్ర బృందం



చిలకలూరిపేట అక్షర విజేత చిలకలూరిపేట నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి ప్రమాణ స్వీకార ఆహ్వాన పత్రికను అందచేసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి జనవరి మూడో తారీకున తాడేపల్లి ఎస్ఆర్ కన్వెన్షన్ లో జరగనున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి రావలసిందిగా ప్రత్తిపాటి పుల్లారావు కి నాదెండ్ల బ్రహ్మం చౌదరి మరియు వారి మిత్ర బృందం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు










# ప్రతి రోజూ కొత్త ఆరంభం కావాలి

**నూతన సంవత్సరం అందమైన జ్ఞాపకంగా మిగలాలి**

**జనసైనికులకు, వీర మహిళలకు, అభిమానులకు జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి నూతన సంవత్సర శుభాకాంక్షలు**



చిలకలూరిపేట అక్షర విజేత ప్రతి జీవితంలో ప్రతి రోజు ఒక కొత్త ఆరంభం కావాలని,2026, నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఓ అందమైన జ్ఞాపకంగా మిగిలి పోవాలని కోరుకుంటున్నట్లు జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి చెప్పారు. జనసైనికులకు, వీరమహిళలకు, ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇస్తే తప్పని నైజం, రాష్ట్రాభివృద్ధి కోసం తన సర్వస్వాన్ని ధారపోసే తత్వం ఉన్న పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పనిచేయడం మనందరికీ గర్వకారణమని తెలిపారు.పదవుల కోసం కాకుండా, ప్రజల భవిష్యత్తు కోసం పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, చూపిస్తున్న తెగింపు అద్భుతమని కొనియాడారు. ఆయన ఆలోచనా విధానం ఈ నూతన సంవత్సరంలో రాష్ట్రాన్ని మరింతగా ప్రగతి పథంలో నడిపిస్తుందని పేర్కొన్నారు. పదవిని బాధ్యతగా భావించి...సామాన్యుడి గొంతుకగా నిలచిజనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ఇంటింటికీ తీసుకెళ్లి, జనసేన జెండాను రెపరెపలాడించడమే మనందరి లక్ష్యం కావాలని, ఈ దిశగా జనసైనికులు అడుగులు వేయాలని బాలాజి తెలిపారు. నేడు ఆంధ్రప్రదేశ్ గడ్డపై వికసిస్తున్న అభివృద్ధికి, కనిపిస్తున్న ఆశావహ దృక్పథానికి మన నాయకుడు పవన్ కళ్యాణ్ అలుపెరగని పోరాటమే పునాది అని పేర్కొన్నారు.రాజకీయాల్లో నిలకడకు, నిజాయితీకి నిలువుటద్దం మన ప్రియతమ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని, కూటమి ప్రభుత్వంలో ఆయన పోషిస్తున్న పాత్ర, గ్రామీణాభివృద్ధి నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు ఆయన చూపిస్తున్న చొరవ అద్వితీయమైనవని చెప్పారు. .కేవలం అధికారం కోసం కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తు కోసం ఆయన వేసిన ప్రతి అడుగు నేడు రాష్ట్రానికి రక్షణ కవచంలా మారిందని వివరించారు. పదవిని బాధ్యతగా భావించి, సామాన్యుడి గొంతుకగా నిలుస్తున్న ఆయన నాయకత్వం మనందరికీ స్ఫూర్తిదాయకమని వెల్లడించారు. నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, మన జనసేన పార్టీ ప్రజాసేవలో సరికొత్త చరిత్ర సృష్టించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# పెన్షన్ల పంపిణీలో జిల్లాలోనే చిలకలూరిపేట మున్సిపాలిటీ ప్రథమ స్థానం

చిలకలూరిపేట అక్షర విజేత పల్నాడు జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ల పంపిణీలో చిలకలూరిపేట మున్సిపాలిటీ జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. డిసెంబర్ 2025 నెలకు సంబంధించి డిసెంబర్ 31-2025 సాయంత్రం 5 గంటల వరకు అందిన నివేదిక ప్రకారం, 94.44



శాతం పంపిణీని పూర్తి చేసి చిలకలూరిపేట మున్సిపాలిటీ జిల్లాలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 10,935 పెన్షన్లకు గాను 10,327 పెన్షన్లను లబ్ధిదారులకు అందజేసి ఈ ఘనత సాధించింది.ఈ సందర్భంగా చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 2026 పెన్షన్లను ఒక రోజు ముందుగానే, అంటే డిసెంబర్ 31వ తేదీనే అత్యంత సమర్థవంతంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. సూపర్వైజర్ల నిరంతర పర్యవేక్షణ, సచివాలయ ఉద్యోగుల అంకితభావం మరియు చురుకైన పనితీరు వల్లే ఈ అద్భుతమైన ఫలితం సాధ్యమైందని ఆయన కొనియాడారు. జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు జిల్లా అధికారులు సైతం కమిషనర్ పి శ్రీహరి బాబు మరియు ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# స్వామి వారి పులిహోర ప్రసాదం పై దుష్ప్రచారం

## -సోషల్ మీడియా లొ పొస్టు చేసిన వారిపై పోలీసులకు పిర్యాదు

## -ప్రసాదాన్ని అన్ని జాగ్రత్తలు తీసుకునే చేస్తాం



అక్షర విజేత సింహాచలం:: ప్రస్తుతం సోషల్ మీడియాలో లేనిపోని అబద్దాలతొ కూడిన విషయాలను ప్రచారం చేస్తూ పాపులర్ కావడానికి చాలామంది ప్రయత్నం చేస్తున్నారు, ముఖ్యంగా మతాలపైనా కులాలపైనా దుష్ప్రచారం చేస్తూ తప్పుడు కూతలు చూస్తున్నారు, సింహాచలం స్వామి వారి ప్రసాదం లొ నత్తవచ్చిందని ఇద్దరు యువతి యువకులు సోషల్ మీడియా లొ పోస్ట్ పెట్టి ప్రసాదం కొనెటపుడు చూసుకుని కొనండి అంటూ భక్తులకు చెబుతూ పోస్ట్ పెట్టడంతొ అది కాస్త వైరల్ అయ్యి స్వామి వారి భక్తుల మనోభావాలను దెబ్బ తీసె విధంగా తయారయింది,దీంతొ ఆలయ అధికారులు ఈ వీడియొ ను క్షుణ్ణంగా పరిశీలించి ఇది కావాలనె దుష్ప్రచారం చేస్తున్నారని ఇటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లొ పిర్యాదు చేశారు,అసలు స్వామి వారి ప్రసాదం చాలా జాగ్రత్తలు తీసుకుని చేస్తామని, పులిహోర లొ వేసె చింతపండు పులుసు మిషన్లు లో వేసి గుజ్జు తీసి వేస్తామని,అలాగె పులిహోర లొ వేసె పోపులు తొ కూడిన పలు దినుసులను బాగా వేయించిన తరువాత వేస్తామని,అలాగె పులిహోర కు వాడె రైసు కూడా పలు జాగ్రత్తలు తీసుకుని బ్రాయిలర్ లలో ఉడికిస్తామని అటువంటి పరిస్థితుల్లో ఇటువంటి నత్త ఎలా కనిపిస్తుందని ఆలయ అధికారులు ప్రశ్నిస్తున్నారు,కనీసం తలవెంట్రుకలు కూడా పడకుండా తలకు మాస్క్ లు వేసుకుని మరీ జాగ్రత్తలు తీసుకుంటామని అలాంటప్పుడు ఇది ఎలా సాధ్యం అంటున్నారు అధికారులు,వీడియో ని క్షుణ్ణంగా పరిశీలించి తప్పుడు పోస్టులు పెట్టి భక్తుల మనోభావాలతొ ఆడుకునె వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు అధికారులు పిర్యాదు చేశారు, ఇటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టరాదని తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు సోషల్ మీడియా లొ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు,దేవుడు ఒక్కడే నాని హిందువులు వెంకటేశ్వరుడని, క్రైస్తవులు జీసస్ అని ముస్లింలు అల్లా అంటూ ప్రార్థించె సర్వమత సమ్మేళనంతొ సబ్కా మాలిక్ ఏక్ హై అంటూ జీవించె మన భారతదేశంలో ఇటువంటి దుష్ప్రచారాలు ఎక్కువ అయ్యాయని ఇటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు